17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,9 జనవరి 2024

ట్రెజరీ స్ట్రాంగ్ రూంలో ఉన్న ఆర్టికల్స్ ఉపసంహరించుకోవాలి

- నోడల్ అధికారి, జెసి తేజ్ భరత్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ట్రెజరీ స్ట్రాంగ్ రూంలో ఉన్న ఆర్టికల్స్ ఉపసంహరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, స్ట్రాంగ్ రూం పర్యవేక్షణ జిల్లా నోడల్ అధికారి ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక జేసీ ఛాంబర్ లో సమన్వయ తొమ్మిది శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, దీర్ఘ కాలికంగా జిల్లా పరిధిలోని 15 శాఖలకు చెందిన 79 ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూం లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా శాఖలకు వివరాలు తెలియ చెయ్యడం జరిగిందన్నారు. ఇరిగేషన్ 28, ఎసిబి 13 , పోలీస్ 13 , పంచాయతీ రాజ్ 6 , రెవెన్యూ 5 , ప్రిజన్స్ 2, గిరిజన సంక్షేమ 2 , సీ ఐ డి 3 , ఆర్ అండ్ బి, సమాచార శాఖ , విజిలెన్స్ , దేవాదాయ , ట్రెజరీ, జుడిషియల్ శాఖలకు చెందిన ఒకొక్కటి ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూం లో ఉన్నాయని తెలిపారు. నాలుగు అంశాల వారీగా ఏ ఏ ఆర్టికల్స్, ఎంతకాలం నుంచి, స్టాంప్స్, చెక్ బుక్స్ వారీగా సమగ్ర నివేదికను సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జీ. నరసింహులు , జిల్లా ట్రెజరీ అధికారి ఎన్. సత్యనారాయణ , సహాయ ట్రెజరీ అధికారి కె. వినోద్, అదనపు ఎస్పీ ఎల్. చెంచు రెడ్డి , జిల్లా రిజిస్ట్రార్ కే. ఆనంద రావు , ఎండోమెంట్ ఎ సి - వి. సోమశేఖర తదితరులు పాల్గొన్నారు.

జన భగీదరి పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు

- అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఆదేశం

కాకినాడ, మేజర్ న్యూస్ : ఈనెల 19వ తేదీన విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో ముందస్తుగా జన భగీదరి పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా మాట్లాడుతూ స్వరాజ్ మైదానంలో ఈనెల 19న 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహము, స్మృతి వనము ఆవిష్కరణ కార్యక్రమం జరుగునుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విగ్రహ ఆవిష్కరణకు ముందుగా ఈనెల 8వ తేదీ నుండి 18వ తేదీ వరకు సంస్మరణ చేసుకుంటూ జన భగీదరి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమాలనుసజావుగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో పౌరులను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించాలన్నారు. ఒక్కో గ్రామం, వార్డు నుండి ప్రజలు 5 మంది పాల్గొనేలా చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరూ ఫ్లెక్సీ బ్యానర్ పై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ, ప్రతిజ్ఞ చేస్తూ ఫ్లెక్సీ బ్యానర్ పై సంతకం చేసేలా చూడాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగం లోని ఉపోద్ఘాతంతో ప్రతిన పూనాలన్నారు. అంతేకాకుండా ఎస్సీ కాలనీలలో సామాజిక న్యాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో జిల్లా కేంద్రంలో మారథాన్ పరుగు నిర్వహించాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రను తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి విద్యావేత్తలు, సామాజిక న్యాయం కోసం పనిచేసే ప్రతినిధులు, సంస్థలనుఆహ్వానించాలన్నారు.

అన్నిపాఠశాలల్లోచిత్రలేఖనం, వ్యాస రచన, చర్చ కార్యక్రమాలు, క్విజ్ వంటి పోటీలు నిర్వహించాలన్నారు. అన్ని కళాశాలల్లో సామాజిక న్యాయంపై విద్యార్థులతో చర్చ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలు అన్నింటిని ఏరోజు కారోజు ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో ఇంచార్జ్ డిఆర్ఓ, డీఆర్డీఏ పీడి శ్రీరమణి, జిల్లా పరిషత్ సీఈవో ఏ.వెంకట రమణారెడ్డి,డీపీవో కె.భారతి సౌజన్య, డీఎం అండ్ హెచ్‌వోజే.నరసింహనాయక్,ఆరోగ్యశ్రీజిల్లాకోఆర్డినేటర్ డా.పీ .రాధాకృష్ణ,మెప్మా పీడీ బి.ప్రియంవద,కాకినాడ డీఎల్‌డీఓ పి.నారాయణ మూర్తి, పీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, మున్సిపల్,విద్యాశాఖ,సాంఘికసంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్న సిఎం జగన్

- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

- అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు.

- ఎంపి భరత్ రామ్

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్: నిరుపేదలంతా ఆంగ్ల మాధ్యమంలో చదువుకుని..ఉన్నతికి రావాలన్న ముఖ్య ఉద్దేశ్యం తో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తోందని ఎమ్.పి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం ఉదయం అర్బన్ మండలంలోని పాఠశాలల 8 వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు అందరూ ప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నతికి రావాలన్నారు. విద్య పిల్లలకు ఇచ్చే ఆస్తి అని సి ఎమ్ అంటూ ఉంటారన్నారు. పేదరికం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలనుబాల కార్మికులు గా పనుల్లో పెట్టకూడదు అని, జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా 15 వేల రూపాయలు తల్లుల ఖాతాల్లోకే నేరుగా జమ చేయడం జరుగుతోందన్నారు. నాలుగు సంవత్సరాల్లో విద్యలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల ప్రభావంతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేరళ ను దాటి అక్షరాస్యత రేటులో మొదటి స్థానంలో ఉండటం గర్వకారణం అన్నారు. సంక్రాంతికి సుబ్రహ్మణ్య మైదానంలో ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియం, ఆంబిథియేటర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు..ప్రతిరోజూ సాయంత్రం ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం లో ఉచితం గా సినిమాలు చూడవచ్చు అన్నారు. ఇంకా తమ హయాంలో ఈట్‌స్ట్రీట్,హేపీస్ట్రీట్ ,కంబాల చెరువు ,దానవాయిపేట పార్క్..ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు దాదాపు రూ 17,500/-పైగా మార్కెట్ విలువగల టాబ్ ,రూ.15,500/- విలువ గల లైజూస్ కంటెంట్‌తో కలిపి ప్రతి 8వ తరగతి విద్యార్థికి రూ. 33,000/-ల లబ్ధి చేకూరుతోందన్నారు.. 8వ తరగతి విద్యార్థులుపై తరగతులకు వెళ్ళినపుడు కూడా ఉపయోగపడేలా ఎనిమిదవ తరగతి తో పాటు, తొమ్మిది పది తరగతుల బైజుస్ కంటెంట్ కూడా లోడ్ చేసి ఇస్తున్నారన్నారు.ఈ సంవత్సరం ఇచ్చే టాట్‌లలో 11,12 తరగతుల సబ్జెక్ట్ లు కూడా అవసరాన్ని బట్టి లోడు చేసుకునేందుకు వీలుగా మెమోరీ కార్డ్ సామర్థ్యాన్ని 256 జిబి పెంచి అందచేస్తున్నారన్నారు. అర్బన్ రేంజ్ డిఐబిదిలీప్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అర్బన్ మండలంలో ఈ విద్యా సంవత్సరం 2023-24 రెండో విడత టాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో 2123 మంది విద్యార్థులకు సామ్‌సంగ్‌ట్యాబ్‌లను అందచేయడం జరుగుతోందన్నారు.

కేటీసీలో సంక్రాంతి సంబరాలు

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మండలం, గుంటూరు ఉండూరు దగ్గరలో ఉన్న బ్రహ్మానందపురంలో కేటిసి స్కూల్లో సోమవారం మధ్యాహ్నం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. టిటిసి స్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు భాగంగా మొదటి విడతగా గాలిపటాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కేటీసీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ఎస్ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతి సాంప్రదాయాలను వెలుగులోనికి తెచ్చేందుకు ఈ సంక్రాంతి ద్వారా క్రీడలు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక వల్లాసం కలుగుతుందని తద్వారా విద్యార్థులు చదువులో పాటుగా శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తొలిత గాలిపటాలు పోటీలను కేటీసీ సంస్థ వ్యవస్థాపకులు కిరణ్ కుమార్ ప్రారంభించారు అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున గాలిపటాలు ఎగరవేయడంలో పాల్గొని ఉత్సాహంగా ఉరకలు వేశారు. సంక్రాంతి సందర్భంగా విద్యార్థులను మన భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు తెలియపరచడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంక్రాంతి పండుగ నిర్వహించే ఆటలు ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పోటీలో ముగ్గులు పోటీలు హరికథ వేషధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత కే టి సి వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పి.డి.ఎస్. (చౌక బియ్యం) అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : కాజులూరు మరియు జగ్గంపేట మండలములలో పి.డి.ఎస్. (చౌక బియ్యం) అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కాకినాడ జిల్లాలోని కాజులూరు మండలంలోని ఆర్యావటం గ్రామములోని ఒక ఇంటి నందు బియ్యం అక్రమ నిల్వకు సంబంధించిన విశ్వసనీయ సమాచారంపై సోమవారం విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టి 40 బ్యాగ్ లలో సుమారు రూ.81,315 లు విలువ గల సుమారు 1,807 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. బియ్యం సీజ్ చేసి, సలాది జగదీష్ అను వ్యక్తిపై 6-ఏ క్రింద కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు పోలీసు స్టేషన్ కు సిఫారసు చేశారు. కాకినాడ జిల్లాలోని జగ్గంపేట మండలంలోని రాజపూడి గ్రామములోని రెండు గృహముల నందు బియ్యం అక్రమ నిల్వకు సంబంధించిన విశ్వసనీయ సమాచారంపై సోమవారం విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి సదరు గృహముల తనిఖీ చేసి, అప్పన వీరబాబు అను వ్యక్తి ఇంట్లో 25 బ్యాగ్‌లలో సుమారు 920 కేజీల పిడిఎస్ బియ్యంను, అట్లూరి శ్రీనివాస్ అను వ్యక్తి ఇంట్లో 23 బ్యాగ్ లలో సుమారు 1080 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. రూ.87,400ల విలువ చేసే ఈ మొత్తం 2 వేల కేజీల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసి, 6-ఏ క్రింద కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. ఈ సందర్భముగా ఇంచార్జ్ రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఎ.సురేష్ బాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పి.డి.ఎస్. (చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుంది అని, ఎవ్వరైనా పి.డి.ఎస్. (చౌక బియ్యం) కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. తనిఖీలలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ టి.నాగవెంకటరాజు, సబ్-ఇన్‌స్పెక్టర్ జగన్నాధరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మినారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్స్ లోవరాజు, లోవ కుమార్, కిషోర్ మరియు రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

ఇరిపాక శివాలయం వద్ద భక్తజన సందోహంతో కోటి మట్టి శివలింగాల తయారీ

- పర్యవేక్షిస్తున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట మండలం ఇరిపాక ఏలేరు నది తీరన వేంచేసి వన్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేకం కోసం కోటి మట్టి శివలింగాల తయారీ జరుగుతున్న విషయం విధితమే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి ఈ కోటి మట్టి శివలింగాల తయారీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అనేక ప్రాంతాల నుంచి భక్తజనం తండోపతండాలుగా ఇరిపాక వస్తున్నారు. వారికోసం జ్యోతుల నెహ్రూ మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం నాడు మట్టి శివలింగాలు తయారీలో అచ్యుతాపురం, జగపతినగరం, శృంగారాయుని పాలెం, గండేపల్లి, తిరుమలాయపాలెం, మల్లవరం, గొల్లలగుంట, మామిడాడ తదితర గ్రామాల నుంచి వందలాదిమంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జ్యోతుల నెహ్రూ పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ శ్రీమతి మణి, తోట సునీత సర్వారాయుడు,బొల్లం రెడ్డి రామకృష్ణ,వల్లేపల్లి సత్యనారాయణ,కోల ఏసుబాబు,కొత్తపల్లి సత్యనారాయణ,నల్లల నాగేశ్వరరావు,పిట్ట అరుణ్,అయినం నాగు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంను ముట్టిడించిన మున్సిపల్ కార్మికులు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, పండుగ సెలవులు, వారంతపు సెలవులు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమ్మె సోమవారంకు 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంను ముట్టడించారు. ఈ సమ్మెకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు), టిడిపి పట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కరణం ప్రసాదరావులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, శివకోటి అప్పారావు, భూపతి శ్రీను, మడికి కృష్ణ, చాపల అర్జయ్య, ముత్యాల దుర్గ, పెడారి గంగ, వర్రే భవాని, వెంకటలక్ష్మి, సత్యవతి, వర్రే నాగదేవి, దోణం దేవ వరప్రసాద్, పలివెల అప్పారావు, వర్రే గిరిబాబు, ఈశరపు దుర్గాప్రసాద్, సింగంపల్లి సింహాచలం, మడికి మోహనరావు, దొండపాటి శేషారావు, యాసలపు శ్రీకాంత్, వర్రే రాజేష్, కె.వి.రమణ, బాసిన భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి ప్రజల కుటుంబాలకి

జరగన్నే ఆరోగ్య భరోసా

- రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా రు.25 లక్షల వరకు ఉచిత వైద్యం
- 4313 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.1,30,36,000 పంపిణీ
- పేదవాని ఇంట పెద్దకొడుకుగా.. సీఎం జగన్ మోహన్ రెడ్డి
- మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్,మేజర్ న్యూస్ : పేదవాడి ఆరోగ్య భద్రతకు పెద్ద పీట వేసిన ఘనత ఆనాడు వైయస్ఆర్ అయితే, ఆయన తనయుడిగా నేడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మరో రెండడుగులు ముందుకేసి ఆరోగ్య శ్రీ ద్వారా రు. 25 లక్షలు చేశారన్నారు. గతంలో ఉన్న వార్షిక ఆదాయ పరిమితి ని రూ. 5 లక్షలకు పెంచి మరింత మందికి ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం లోని ఆల్కాట్ గార్డెన్ మున్సిపల్ కళ్యాణ మండపంలో నగరపాలక సంస్థ పరిధిలో గల డివిజన్ల లోని లబ్ధిదారుల కొరకు ఏర్పాటుచేసిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, సినిమా ఆటోగ్రాఫ్ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు నేడు పెన్షన్ రు.2750 నుండి 3000 వరకు పెంచి అవ్వ తాతలతో పాటు అర్హులైన లబ్ధిదారులందరికీ ఎంతో ఆర్థిక ప్రయోజనాన్ని అందించి సంక్షేమ ఫలం అంటే ఇదేనని నిరూపించా రని అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలోని నగరపాలక సంస్థ వార్డుల్లోని 14 సచివాలయాల పరిధిలో నూతనంగా పెంచిన 48 పెన్షన్ల కలుపుకొని 4313 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.1,30,36,000/- అందిస్తున్నామన్నారు.పేదవాడి ఇంటి పెద్ద కొడుకులా సీఎం జగన్మోహన్ రెడ్డి అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే దృక్పథంతో రేషన్ కార్డ్, ఆరోగ్యశ్రీ, ఫామిలీ డాక్టర్ కాన్సెప్ట్, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారాన్నారు. పేదవాని ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యాన్ని అందించే దిశగా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రు. 25 లక్షల రూపాయల ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ప్రజలను, దైవాన్ని నమ్మిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ఆ బంధాన్ని ఎవ్వరూ విడదీయ లేరని మంత్రి పేర్కొన్నారు. గతంలో 65 సంవత్సరాలు వయసు ఉంటేనే గాని పెన్షన్ వచ్చేది కాదు, కాని జగనన్న ప్రభుత్వం వచ్చాక 60 సంవత్సరాలకి కుదించి అర్హులందరికీ పెన్షన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు. గత ప్రభుత్వం 2019 జనవరిలో హడావిడిగా 2000 చేసి ఫిబ్రవరి మాసంలో అందిస్తే, జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక పేదల పట్ల ఉన్న గొప్ప గౌరవంతో దానిని రు.2250 చేసి, ఇచ్చిన హామీ నిలుపు కుంటూ నేడు రు.3000గా చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎప్పుడైనా 1వ తేదీన పెన్షన్ అందించడం చూశారా..? నేడు వాలంటరీ ద్వారా 1వ తేదీ ఉదయాన్నే ఇంటింటికి ఈ ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన పెంపు పంపిణీని ప్రజల మధ్య జరుపుకోవడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు వెళ్తున్న చిన్నయ్య దొర

సామర్లకోట, మేజర్ న్యూస్ : ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో గత 15 సంవత్సరాల క్రితం భారత మాతా సేవా పరిషత్ అనే సేవా సంస్థను స్థాపించి కోట్లాది రూపాయల్ని వెచ్చించి ప్రజలకి అనేక సేవా కార్యక్రమాలను చేయడం జరిగిందని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు గొరకపూడి చిన్నయ్య దొర పేర్కొన్నారు.సోమవారం సామర్లకోటలో భారత మాతా సేవా పరిషత్ కార్యాలయంలో మీడియాతో మాట్లడుతూ 2014 ఎన్నికలకు ముందు సామాజిక సమీకరణలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యే టికెట్ తనకే ఇస్తారని కొంత మంది తెలుగుదేశం సీనియర్ నాయకులు పేర్కొనడంతో తాను చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరానని పేర్కొన్నారు.ఐతే తదనంతరం జరిగిన పరిణామాల వలన జై భారత్ నేషనల్ పార్టీని స్థాపించడం జరిగిందనీ పేర్కొన్నారు.ఐతే ఇటీవల ఆ పార్టీకి అధ్యక్షునిగా జే.డి లక్ష్మి నారాయణను ప్రకటించి తాను తప్పుకోవడం జరిగిందని తెలిపారు.అదే విధంగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తెలుగదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తన భార్యను పోటీలో నిలబెట్టడం,ఎన్నికల్లో ఓటమి చెందడం జరిగిందని పేర్కొన్నారు.ఇటీవల వివిధ పార్టీల నాయకులకు చెందిన నాయకులు తనను కలవడం,పార్టీలలోకి ఆహ్వానించడం కూడా జరిగిందన్నారు.తాను పదవుల కోసం రాజకీయాలలోకి రాలేదని,ప్రజా సేవ కోసమే రాజకీయాలలోకి రావడం జరిగిందన్నారు. తాను ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు తేల్చి చెప్పారు.

నేషనల్ స్కూల్ గేమ్స్ న్యూఢిల్లీ స్విమ్మింగ్ కాంపిటీషన్‌లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

కాకినాడ, మేజర్ న్యూస్ : నేషనల్ స్కూల్ గేమ్స్ 2023-2024 న్యూఢిల్లీలో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో గంగరాజునగర్ ఆదిత్య టాలెంట్ స్కూల్ విద్యార్థి ఎ.షణ్ముఖ శ్రీసాయి (400 మీటర్స్ ఫ్రీ స్టయిల్, 200 మీటర్స్ బ్యాక్ స్ట్రాక్) ఈవెంట్‌లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున పాల్గొని నేషనల్ లెవల్‌లో విశేష ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.మొయిన, వైస్ ఛైర్మన్ ఎన్.కె.దీపక్ రెడ్డి మరియు ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి విద్యార్థిని షణ్ముఖ శ్రీసాయి ని, వారి తల్లిదండ్రులను అభినందించారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాము

- టిడిపి, జనసేన, సిపియం మద్దతు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : అంగన్‌వాడీలు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 28 రోజులుగా చేస్తున్న సమ్మెను అణచివేయాలని చూస్తూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ తీసుకువచ్చిన జిఓకు భయపడాల్సిన పని లేదని, తెలుగుదేశం, జనసేన, సిపియం పార్టీలు అంగన్‌వాడీలుకు భరోసానిచ్చాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీలను ఉద్దేశించి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు), టిడిపి పట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కరణం ప్రసాదరావులు ప్రసంగించారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు క్రాంతికుమార్, రెడ్డి సీతారత్నం, పేపకాయల వీరవిజయ లక్ష్మి, టి.ఎల్.పద్మ, సావిత్రి, స్నేహ, కాలె దేవి, నెహ్రూ కుమారి, చంటమ్మ, నాగమణి, లోవతల్లి, వసంతలక్ష్మి, తులసి, వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల డిమాండ్స్ పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

- పారిశుధ్యంలో ప్రత్యామ్నాయ పనులు చేయిస్తే అడ్డగిస్తాం - బైక్ ర్యాలీ నిరసన

- కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడి, అర్ధ నగ్న ప్రదర్శన

కాకినాడ,మేజర్‌న్యూస్ : ఏపీమున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎఐటియుసి అనుబంధ సంఘం, స్వతంత్ర సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె ఆరవ రోజు కొనసాగుతోంది. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల డైమండ్స్ పరిష్కారానికై సోమవారం ఉదయం కాకినాడలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ బైక్ ర్యాలీలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ హీనమైన పనులుచేస్తున్నపాశుధ్యకార్మికుల డిమాండ్స్ పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని,కార్మికుల సమస్యల తక్షణమే పరిష్కరించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రత్యామ్నాయ పనులు చేపడితే అడ్డగిస్తామని, ప్రత్యేక పనులకు నిధులు కేటాయించే కన్నా బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని, అందుకే కాకినాడలో ఉన్నఅన్నిసర్కిళ్ళలోసోమవారం బైక్ ర్యాలీ నిర్వహించామని, ఈ బైక్ ర్యాలీ కారణంగా సెంటర్ నుండి ప్రారంభమై జిబిటి రోడ్డు కొండయ్యపాలెం,భానుగుడిసెంటర్,టూటౌన్,మెయిన్‌రోడ్, జగన్నాధపురం, సినిమా రోడ్, నాయక కేఫ్ సెంటర్ మీదుగా భానుగుడి సెంటర్ చేరుకుని బైకులతో మానవహారం చేశామని ప్రసాద్ అన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడి చేసి, అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు మంజూరు చేయాలని, గ్రాడ్యుటి ఇవ్వాలని, వస్త్ర కార్యాలయం వద్ద మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్లు అమలు చేయాలని నినాదాలు చేశారని ప్రసాద్ అన్నారు. ఈ సమ్మెకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఇకనైనా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రజాప్రతినిధులు మాట్లాడాలని, రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వారికి జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో 14 సర్కిల్ ప్రతినిధులు జనపల్లి అప్పన్న, లక్ష్మణ్, కుమార్, సింహాచలం, చక్రవర్తి, రాజు, వడ్డీ పోలమ్మ, ఇందిరా, సుబ్బారావు, నగేష్, గంటా నాగేశ్వరరావు, ములికి సత్యనారాయణ, నైట్ శానిటేషన్ కటారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సమ్మెకు పర్మనెంట్ ఎంప్లాయిస్ తరఫున బంగారు రాజేష్ కమిటీ ప్రతినిధులు మద్దతు తెలియజేశారు.

నోటీసులతో సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటాన్ని ఆపలేరు

- కాకినాడ డీఈవో కార్యాలయం వద్ద సోకాజ్ నోటీసులు భగ్ధం

- మరింత ఉధృతంగా సమ్మె పోరాటం...ఉద్యోగుల ప్రతిన

కాకినాడ, మేజర్ న్యూస్ : సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన షోకాజు నోటీసులను కాకినాడ డీఈఓ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న ఉద్యోగులు ధగ్ధం చేసి నిరసనను తెలియజేశారు. ఐదో తేదీ ఎస్డీడీ కార్యాలయం ముట్టడి సందర్భంగా చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపిన అధికారులు నేడు నోటీసులు పంపి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించడం మానుకోవాలని హితవు పలికారు. ఈ తాటాకు చప్పుళ్ళకు, నోటీసులకు భయపడేది లేదని నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేయమంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని చెప్పి నోటీసులు ఇచ్చిన జగన్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. సమగ్ర శిక్షలో 6వేలు జీతం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నారని, పెరిగిన ధరలకు వేతనాలు ఏమాత్రం సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార యాత్రలో జగన్ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు.సోమవారం కార్యక్రమనికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు ఎం.చంటిబాబు, సత్యనాగమణి, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి.సాయికిరణ్, ఎ. లోవరాజు, పివివి.మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ,సహాయ కార్యదర్సులు కె.చంద్రశేఖర్, జి.నారాయణ, ఎంబి.సాల్మన్, జిల్లా కోశాధికారి పి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ తదితరులు నాయకత్వం వహించారు.

ఘనంగా గణపతి బాబులు జయంతి

అంబాజీపేట, మేజర్ న్యూస్ : దివంగత టిడిపి నాయకుడు, అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గణపతి నాగ సత్యనారాయణ (బాబులు) జయంతి వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో సోమవారం గణపతి బాబులు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి బాబులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అమలాపురం పార్లమెంటరీ టిడిపి ఎస్సీ నాయకుడు చిన్నం బాలవిజయరావు, మాజీ సొసైటీ చైర్మన్ గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొంతు పెదబాబు, సంచార జాతుల టిడిపి రాష్ట్ర డైరెక్టర్ యడ్లపల్లి తుక్కియ్య, జిల్లా సంస్కృతి విభాగం కార్యదర్శి రవణం రాము, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య, నాగవరపు అన్నవరం, మోకా శ్రీను, డాక్టర్ సెల్ అధ్యక్షులు గల్లా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నక్క వెంకన్న

ఎటపాక, మేజర్ న్యూస్ : కాంగ్రెస్ పార్టీ ఎటపాక మండల నూతన అధ్యక్షులుగా నక్క వెంకన్న మరోసారి నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదివారం మండలాలవారీగా నూతన అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నక్క వెంకన్నను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు వెల్లడించింది. తనపై నమ్మకంతో పార్టీ ఆదిష్టానం 4వసారి మండల అధ్యక్షులుగా నియమించినందుకు వెంకన్న ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పి.సి.సి. అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వైఎస్ షర్మిల, జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, పి.సి.సి. డెలిగెట్ సభ్యులు ఎం.డి. హబీబ్ కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం సైనికుడిలా శక్తివంచన లేకుండా పనిచేస్తానని అధ్యక్షులు నక్క వెంకన్న స్పష్టం చేశారు.

ఎల్.బి.నగర్‌లో జనసేన 'భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు హామీ' యాత్ర

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు హామీ యాత్రా కార్యక్రమం సోమవారం అగ్రహారపు సతీష్ ఆధ్వర్యంలో ఎల్.బి నగర్ ప్రాంతంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ శ్రేణులు భవననిర్మాణ కార్మికులను కలిసి మాట్లాడుతూ ఏనాడైతే ఈ వై.సి.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో ఆనాటినుండే నిర్మాణ రంగంలో చీకట్లు అలుముకున్నాయన్నారు. ప్రకృతి ప్రసాదించే ఇసుకని అడ్డం పెట్టుకుని కార్మికుల కడుపులు కొట్టింది ఈ ముఖ్యమంత్రి అని ఆరోపించారు. అందరికీ నీడనిచ్చే ఇల్లు కట్టే వీరికి సొంత నీడ నిచ్చే గూడు లేదనీ, అది తాము అందిస్తామన్నారు. అందుకే నేడు భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే మానిఫెస్టోలో రూపకల్పన చేసేలా తమ జనసేన తెలుగుదేశం పార్టీలు అడుగులు వేస్తున్నాయన్నారు. రాబేయే రోజులలో జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీల కూటమికి మీయొక్క మద్దతును ఇవ్వవలసినదిగా కోరారు. కార్యక్రమంలో సతీష్, వాసు, నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం క్షీణించకుండా చర్యలు తీసుకోండి

- ప్రైవేటు కార్మికుల ద్వారా మెరుగైన పారిశుధ్య సేవలు

- కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం - 1,2,3 డివిజన్లో కమిషనర్ పర్యటన

కాకినాడ, మేజర్ న్యూస్ : పారిశుధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రైవేట్ కార్మికులను కూడా వినియోగించి పారిశుధ్య సేవలు మెరుగుపరచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. సోమవారం ఆయన ఒకటో సర్కిల్ 1,2,3 డివిజన్లలో పర్యటించారు. కొండేలుపేట, శంతనపురి కాలనీ, తోట సుబ్బారావు నగర్, బీసీ కాలనీ, రమణయ్యపేట మార్కెట్, ఎన్.ఎఫ్.సి.ఎల్. రోడ్ ప్రాంతాలలో పారిశుధ్య పరిస్థితిని పర్యవేక్షించారు. అక్కడక్కడ చెత్త పేరుకు పోవడాన్ని గుర్తించారు. అక్కడే ఉన్న శానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్మికులు సమ్మె చేస్తున్నందున చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలో వేయకుండా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్లకు వచ్చే హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే తడి - పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కమిషనర్ కోరారు. పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులు అందుబాటులో లేనందున ఆయా ప్రాంతాలకు అవసరాన్ని బట్టి ప్రైవేట్ కార్మికులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. శానిటేషన్ విషయంలో స్పెషల్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

అంగన్వాడీల 24 గంటలు దీక్షలు మూడవరోజుకు

- ఎస్మా విధిస్తే, ఉద్యోగులుగా గుర్తించినట్లే

కాకినాడ, మేజర్ న్యూస్ : అంగన్వాడీలు సమ్మెపోరాటం 28వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటలు దీక్షలు మూడో రోజు శిబిరాన్ని ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సిఐటియు సీనియర్ నాయకులు మెడిశెట్టి వెంకటరమణ ప్రారంభించి మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ వేతనాలు ఒకసారి మాత్రమే పెంచుతామని, రెండు మూడు సార్లు పెంచలేమని చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2019 నుండి ధరలు ఒకసారి మాత్రమే పెరగలేదని, జగన్మోహన్ రెడ్డి ప్రతినెలా కరెంటు చార్జీలు పెంచుతున్నాడని, చెత్త పన్ను పేరుతో కొత్త రకాల పన్నులు వేస్తూ, కూరగాయల ధరలు, నిత్యవసరాలు ధరలు అయితే చెప్పనవసరం లేదని, అలాంటప్పుడు ఒకసారి వేతనం పెంచితే ఎలా సరిపోతుందని తిరిగి ప్రశ్నించారు. ఎస్మా ప్రయోగించి సెక్షన్ 21 ఐపిసి ప్రకారం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా జీవో నెంబర్ 2తో గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ బేసిక్ వేతనం తక్షణం అంగన్వాడీలకు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. సోమవారం 24గంటల రిలే దీక్షలలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, ఉషా, సిహెచ్.రమణమ్మ, ఎస్.బుల్లెమ్మ, రాఘవ, వసంశెట్టి నాగమణి, చేసెట్టి పద్మ, వెంకటలక్ష్మి, సిహెచ్.రత్నమాల, దుర్గా ,నాగలక్ష్మి, గౌరీ,ప్రజావాణి, భవాని, ఎస్.దివ్య, పద్మ, డి.దుర్గా, వీరలక్ష్మి పిఠాపురం ప్రాజెక్టు అంగన్వాడీలు నిర్వహించారు.సోమవారం శిబిరానికి అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ నాయకులు కె.పి.నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంగ సూరిబాబు, ఏపీఎస్ ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ డిపో అధ్యక్షులు పీ.ఎస్.రావ్, డిపో కార్యదర్శి బి.ఎ.రావ్, సామర్లకోట అడ్వకేట్ పోడూరి భాస్కరరావు మద్దతుగా మాట్లాడారు.

వృద్ధ రైతును బాధించడం తగదని జెసికి వినతి

కాకినాడ, మేజర్ న్యూస్ : వ్యవసాయం చేస్తూ జీవనాధారం గడుపుతున్న తనను రెవెన్యూ అధికారులు బాధిస్తున్నారంటూ గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఎరికిరెడ్డి చంద్రరాయుడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియకు వినతిపత్రాన్ని అందించారు. సోమవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జెసికి ఈ వినతి పత్రాన్ని అందించి చంద్రరాయుడు ఆవేదనను వెలిబుచ్చారు.కొడవలి గ్రామంలోని సర్వేనెంబర్ 95/3లో తనకు 25 సెంట్లు భూమి ఉందని, ఆ భూమిని తాను 1996లో కొనుగోలు చేశానని, దానికి రెవెన్యూ అధికారులు 25 సెంట్లతో కూడిన పాసుబుక్కును కూడా అందించారన్నారు. ఈ మధ్యకాలంలో చేసిన జగనన్న రీ సర్వేలో 9 సెంట్లుగానే ఆన్‌లైన్లో చూపిస్తుందని దీనిపై తాము ఫిర్యాదు చేయగా మండల సర్వేర్ వచ్చి సర్వే చేయించగా వారు కూడా 25 సెంట్లుగా నమోదు చేశారన్నారు. అయినా 25 సెంట్లగా మార్పు చేయటం లేదన్నారు. దీనిపై ఎన్నోసార్లు మండల, రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులకు వినతి పత్రాలు అందించినా ఇంతవరకు న్యాయం జరగలేదని ఎరికిరెడ్డి వాపోయారు. ఈ భూమి విషయంపై సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీ పెట్టగా వారు పోలవరం కాలువ తవ్వకాలలో భూమి పోయిందంటూ చేదులూరి నూకరాజు అనే వ్యక్తికి నష్టపరిహారం ఇచ్చామని చెప్పారు. అయినా తనకు సంబంధం లేకపోయినా రీసర్వేలో 9 సెంట్లు మాత్రమే చూపడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రైతుగా తాను ఎవరినీ ఆశించకుండా జీవనాధారం గడుపుతుంటే రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు తాను కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానంటూ వాపోయారు. తక్షణమే దస్తావేజు ప్రకారం పాస్‌బుక్‌లో ఉన్న మాదిరిగా ఆన్‌లైన్లో 25 సెంట్లుగా భూమి మార్పు చేసి తనకు న్యాయం చేయాలని వృద్ధ రైతు చంద్రరాయుడు జెసిని కోరారు.

ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నవరంలో నిరసన

అన్నవరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన లాండ్ టైటిలింగ్ ఆక్ట్ 17/2023 వలన ప్రజలకు, న్యాయవాదులకు తీవ్ర నష్టంకలిగే అవకాశం ఉన్నందున ప్రత్తిపాడు న్యాయవాదులు అన్నవరం గ్రామంలోనిరసన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు తొలి పావాంచ వద్ద స్వామివారికి కొబ్బరికాయ ; కొట్టి బయలుదేరి, చిన రావిచెట్టు సెంటర్ వరకు నడుస్తూ, ఈ యాక్ట్ ను వెంటనే రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్. పుల్లయ్య ఈ చట్టంపై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది అని చెప్పడం జరిగింది. వెంటనే ఈ యాక్టును రద్దు పరచాలని, లేని యెడల ఈ ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అధ్యక్షులు సి.హెచ్.పుల్లయ్య, సెక్రెటరీ, బి.మధుబాబు, ట్రెజరర్ జొన్నాడ రాజేష్, జాయింట్ సెక్రటరీ రాయి శ్రీను, సీనియర్ న్యాయవాదులు. బి.జాన్ బాబు, బి.చలం, యస్.గౌరీశంకర్, కూచిమంచి సూర్య ప్రకాశరావు, జూనియర్ న్యాయవాదులు పలివెల నాగేంద్రరాజు, ఏ.కే.యన్.మల్లేశ్వరరావు,యడ్ల శ్రీను, బి.అశోక్ కుమార్, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'రామ్‌కోసా' పూర్వ విద్యార్థుల కలయిక

- రంగరాయ కళాశాలలో 6,7 తేదీల్లో రెండు రోజులపాటు అలరించిన రాయల్స్ రంగరాయన్స్

- ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రబోస్, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ మంత్రి కామినేని, బ్రహ్మశ్రీ చాగంటి, కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ

- వైద్యో నారాయణో హరి...డాక్టర్‌లను కొనియాడిన ప్రజా ప్రతినిధులు

- గాయని కల్పన మధురమైన ఉర్రూతలూగించిన పాటలతో పూర్వ విద్యార్థుల ఖుషి ఖుషి

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ఆవరణలో ఈనెల 7, 8 తేదీల్లో రెండు రోజులు పాటు 12వ 'రామ్‌కోసా' పూర్వ విద్యార్థుల కలయిక (అలుమ్ని మీట్) అంగరంగ వైభవంగా జరిగింది. దేశ విదేశాల నుండి పూర్వ విద్యార్థులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఆస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రబోస్, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్ లు విచ్చేశారు. వైద్యో నారాయణో హరి అని పెద్దలు అన్నారని, వైద్యుడ్ని దేవుడితో పోలుస్తామని, అలాంటి గొప్ప వృత్తిని చేపట్టి మనల్ని సృష్టించి ప్రాణం పోసిన ఆ దేవుడు, సమాజంలో వైద్యుడు రూపంలో ఏ వ్యాధి వచ్చిన తిరిగి మళ్ళీ ప్రాణం పోస్తున్నారని, వాళ్లకి శతకోటి వందనాలు అని కొనియాడారు. రాంకోసా ప్రెసిడెంట్ వాడ్రేవు రవి, సెక్రటరీ వై.కళ్యాణచక్రవర్తి, ట్రెజరర్ చిట్ల కిరణ్, స్పెషలిస్ట్ ఆధ్వర్యంలో విశిష్ట అతిథులను ఘనంగా సత్కరించారు. వచ్చిన అతిథులకు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రసన్న కుమార్ ఆహ్వానం పలుకుతూ ఫోటో ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశారు. గాయని కల్పన మధురమైన పాటలతో ఉర్రూతలూగిస్తూ పాడగా పూర్వ విద్యార్థుల అందరూ చప్పట్లతో ఖుషి ఖుషిగా ఎంజాయ్ చేశారు.

ప్రత్తిపాడులో పర్యటించనున్న రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

కాకినాడ, మేజర్ న్యూస్ : రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ కాకినాడ జిల్లాలో ఈ నెల 9, 10 తేదీలలో ప్రత్తిపాడు మండలంలో వివిధ గ్రామాలలో పర్యటించనున్నట్లు కాకినాడ జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని ఎ.విజయ శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ జిల్లాలో ఈ నెల 9వ తేదీ ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు కాకినాడ నుంచి బయలుదేరి ఉదయం 9:30లకు ప్రతిపాడు మండలంలో మెట్ట చింత గ్రామానికి చేరుకుంటారని అక్కడ నుంచి గిరిజాపురం, వంతాడ, పొందూరు పాకల, పాండవుల పాలెం గిరిజన గ్రామాలను సందర్శిస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులతో ఆయన మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అదే ఆరోజు రాత్రి అక్కడ బస చేస్తారని ఎ.విజయశాంతి తెలిపారు. 10వ తేదీన ప్రత్తిపాడు మండలంలో పాండవుల పాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించి అక్కడ గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారని ఆమె తెలిపారు. జిల్లాలోని గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ యొక్క అభిప్రాయాలను, ఆలోచనలను, సమస్యలను ఎస్టీ కమిషన్ సభ్యులకు తెలియజేయాలని డీటీడబ్ల్యువో తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్ ఆసిఫ్ నగర్‌కు చెందిన వెళ్లపాలెం సాయి నిఖిల్ రెడ్డి, రేఖా రెడ్డి దంపతులు రూ.50 వేలు విరాళంగా నిలిచారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

ఎస్ఐ, పంచాయతీ సిబ్బందిపై దాడి - ఇద్దరు అరెస్ట్

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామములో విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ, పంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆత్రేయపురం పోలీసులు తెలిపారు. సోమవారం పంచాయతీ స్థలంలో గ్రామానికి చెందిన కల్లూరి మణికంఠ, పెన్నింటి సాయికృష్ణ లు అక్రమ కట్టడం నిర్మాణం చేపట్టారని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసే సమయంలో అక్రమ నిర్మాణదారులైన కల్లూరి మణికంఠ, పెన్నింటి సాయికృష్ణ పంచాయతీ సిబ్బందిపైన, బందోబస్తుకు వెళ్లిన ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పైన మెరుపు దాడి చేసి హత్యాయత్నం చేసినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి సాయిరాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.వై. కిరణ్ కుమార్ తెలిపారు.

ఘనంగా లక్ష తులసి పూజ మహోత్సవం

అంబాజీపేట, మేజర్ న్యూస్ : స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో 26వ లక్ష తులసి పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ స్వామివారికి వైఖానస ఆగమ ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ పాణింగిపల్లి నరసింహాచార్యులు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది అవార్డు గ్రహీత, వైఖానస శిరోమణి, సహస్రాధిక ప్రతిష్టాపన ఆచార్యులైన శ్రీమాన్ పెద్దింటి వెంకటలక్ష్మి నరసింహా చార్యులు బ్రహ్మత్వమున శ్రీ స్వామివారికి వైఖానస ఆగమొక్త ప్రకారముగా 26వ లక్ష తులసి పూజ మహోత్సవము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు కల్పించారు.

ప్రభుత్వం ఎస్మాని ఎత్తివేయాలి

- రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : అంగన్వాడి ఆడపడుచుల పట్ల నిర్బంధాన్ని విధించేందుకు ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని, జీవో 2 ను తీసుకొచ్చిందని తక్షణమే ఎస్మా చట్టం రద్దు చేయాలని రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడి వర్కర్లు అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజు కొనసాగింది. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి కిరణ్, గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, తదితరులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా చట్టం జీఓ ప్రతులను స్థానిక అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్ తదితరులు మాట్లాడుతూ, ప్రభుత్వం తన భయాన్ని బయట పెట్టుకుందన్నారు. చట్టబద్ధంగా నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న అంగన్వాడీలతో 5 దఫాలు నిర్వహించిన చర్చలు తూతూమంత్రంగానే సాగాయన్నారు.సమస్యకు పరిష్కారం చూపకుండా వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడమంటే వారి ఉద్యమానికి జగన్ సర్కార్ భయపడుతుందని అర్థం అవుతుందన్నారు. గతంలో ఎస్మాను ప్రయోగించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని,ఆ జాబితాలోకి వైసిపి వెళ్లబో తుందన్నారు. మహిళా సాధికారత గురించి ప్రగల్భాలు పలుకుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీలు మహిళలు అనే విషయాన్ని మరచిపోయి వారి ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించి తన ఖఠినత్వాన్ని చాటుకుంటుం దని దుయ్యబట్టారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 వేలకు పెంపుదల చేసిందని,ఇది చూసైనా జగన్ రెడ్డి ప్రభుత్వం సిగ్గు తెచ్చుకోవాలన్నారు. అంగన్వాడీలకు మద్దతుగా ఈ నెల 9న జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయని, పట్టుదలతో పోరాడుతున్న

అంగన్వాడీలకు కేంద్ర కార్మిక సంఘాలు,రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు అండగా నిలిచినందుకు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ కుమారి,కె వెంకటలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.తమ సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.,ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం,సిఐటియు, డివైఎఫ్ఐ,ప్రజా సంఘాల నాయకులు,కె జగన్నాథం,కె సూరిబాబు,పి రామరాజు,టి శ్రీను,పి పాపారావు,పి సత్యనారాయణ,పి రాంబాబు,అంగన్వాడి యూనియన్ నాయకులు ఎల్ సత్యవతి,నూకరత్నం,కెలక్ష్మీ,చిన్నమ్ములు,రమణి, రమణ,రత్నం, రాజేశ్వరి, మంగ,రాధ,భవాని పెద్దసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు

28వ రోజుకు చేరిన అంగన్వాడి వర్కర్స్ సమ్మె

వి.ఆర్. పురం, మేజర్ న్యూస్ : వరరామచంద్రాపురం మండలంలో అంగన్వాడీల ఆందోళనలు28 వ రోజులకు చేరుకున్నాయి. రేఖపల్లి, జంక్షన్ వద్ద అంగన్వాడి కార్యకర్తల సమ్మె చేస్తున్న శిబిరం వద్దకు రైతు సంఘ మండల అధ్యక్షులు సీనియర్ సి.పి.ఎం.పార్టీ నాయకులు పంకు సత్తిబాబు, మండల రైతు సంఘం నాయకులు వడ్లాది రమేష్, సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మాజీ సర్పంచ్ ఆసు లక్ష్మయ్య. గిరిజన సంఘ మండల కార్యదర్శి సమ్మెకు మద్దతుగా సంఘీభావం తెలియజేశారు. మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ మహిళ శక్తి అంటే అభల కాదు, మహాశక్తిని 28 రోజులుగా కూర్చొని దీక్ష చేస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం దొంగ వైఖరి ఆలోచిస్తుందని ఆయన ఆరోపించారు. పిల్లలకి చిన్నప్పటినుండి విద్యాబుద్ధులు నేర్పుతూ పిల్లలకు పునాది అంగన్వాడీలని అందరూ గుర్తించి వారికి హామీ మేరకు ఇస్తామన్న న్యాయమైన కోరికలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు. జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు సున్నం రంగ మ్మ, మండల అధ్యక్షులు నాగమణి, మండల కార్యదర్శి రాజేశ్వరి,కుంజా నాగిరెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణరావు, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న సిఎం జగన్ - కంటే

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడులో భాగంగా విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని, దానిలో భాగంగానే కార్పోరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కిందని, రాష్ట్ర వైసిపి కార్యవర్గ సభ్యులు కంటే వీర్రాఘవరావు పేర్కొన్నారు. సోమవారం పెద్దాపురం మండలం, వడ్లమూరు గ్రామంలో స్థానిక హైస్కూల్ నందు ట్యాబ్‌లు, పదవ తరగతి విద్యార్థులకు స్టడి మెటిరియల్ పంపిణీ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు గిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటే వీర్రాఘవరావు పాల్గొని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదవ తరగతి విద్యార్థులకు విద్యాభారతి స్టడి మెటిరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదువుకుని ఉన్నత స్థానాలలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటి చైర్మన్ కంటే పరిమళ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు జానకిరామయ్య, వాయిలేటి చిన్నారావు, ఉండమట్ల గంగారావు, గొల్లపల్లి దొరబ్బాయి, విద్యార్థులు, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టిన జగన్ రెడ్డి ప్రభుత్వం - కొండబాబు

కాకినాడ, మేజర్ న్యూస్ : మోసపూరిత మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి నేడు రాష్ట్ర యువత బంగారు భవిష్యత్తును చీకట్లోకి నెట్టేసాడని తెలుగుదేశం పార్టీ కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో నడుస్తున్నది సంక్షేమ ప్రభుత్వం కాదని సంక్షోభ ప్రభుత్వమని, అధికారం కోసం ఆనాడు జగన్ రెడ్డి యువతకు ఇచ్చిన హామీలలో నేడు ఒకటీ కూడా నెరవేర్చలేదని, వైసిపి ప్రభుత్వం రాగానే 5 లక్షల ఉద్యోగాలు కనిపిస్తానని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని మోసి చేసి, నేడు వైన్ షాపులు, ఫిష్ మార్కెట్లు జాబులు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నాదని, వైకాపా పాలనలో ఒక్క డిఎస్సీ నోటిఫికేషన్ గానీ, పోలీస్, గ్రూపు 1,2,3 నోటిఫికేషన్లు గాని ఇవ్వలేదని, ఐటీ శాఖ మంత్రి వందలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకొని ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయకత్వంలో యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో రైతుల ఆత్మహత్యలలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని, నిత్యావసర వస్తువులు ధరలు భారీగా పెంచి, ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు పెంచి దోచుకోవడం తప్ప సంపద సృష్టించే ఆలోచన జగన్ రెడ్డికి లేదని, ఆంధ్ర రాష్ట్రంలో సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడవాలంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పలివెల రవి, అంబటి చిన్న, గుజ్జు బాబు, బంగారు సత్యనారాయణ, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య కోసం వై.సి.పి.ప్రభుత్వం ఎంతో శ్రమిస్తుంది

- పేద విద్యార్థులకు ఉన్నత చదువులు జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమైంది

-పేదల కోసం 3000/-పెన్షన్

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : ఉన్నత విద్య వై.సి.పి .ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎమ్మెల్సీ అనంత బాబు,ఎమ్మెల్యే ధనలక్ష్మి స్పష్టంచేశారు. సోమవారం అల్లూరిసీతారామ జిల్లా, రంపచోడ వరం నియోజకవర్గం, వరరామ చంద్రాపురం, మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు టాబ్స్ పంపిణీ చేశారు, ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, మాట్లాడుతూ గతంలో పాఠశాలలకు ప్రస్తుత పాఠశాలలకు ఎంతో వ్యత్యాసం ఉందని తెలిపారు. ప్రతీ పేద కుటుంబంలో ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఉండాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయం మని వారన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చి విద్యావిధానంలో సమూల మార్పులు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాధించారని ఆయన తెలిపారు. పెంచిన 3000/-రూపాయలను లబ్ధిదారులకు అందించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ నెల 1ఫస్టు తారీకున ఇంటి ముందు పెన్షన్ కార్యక్రమం,అందించిన ఘనతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, సాధించారని వారు గుర్తుచేశారు. పేదల కోసం తపించే ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వారన్నారు. అనంతరం పెన్ పవర్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎం.పీ.పీ, జడ్పి.టి.సి, వైస్ ఎం.పీ.పీ.లు, ఎం.పీ.టీ.సీ.లు,జె.సి. ఎస్. మండల కన్వీనర్, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ & డైరెక్టర్లు వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ ప్రాధాన్యం

- కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం

- నగరపాలక సంస్థలో డయల్ యువర్ కమిషనర్, స్పందన

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజల నుంచి వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుకూ ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సి.హెచ్. నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ఫోన్ ద్వారా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో దరఖాస్తులు తీసుకున్నారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, టిడ్కో, రెవిన్యూ విభాగాలకు సంబంధించి 11, స్పందనలో 10 దరఖాస్తులు అందాయి. వీటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు పరిష్కరించిన అనంతరం అందుకు సంబంధించిన సమాచారాన్ని కూడా దరఖాస్తుదారులకు తెలియజేస్తామన్నారు.

టోల్ ఫ్రీకి కాల్ చేయండి...ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ కమిషనర్, స్పందనతో పాటు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్ కు కూడా కాల్ చేయవచ్చునని కమిషనర్ ప్రజలకు సూచించారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు పై నెంబర్ కు ఫోన్ చేసి సమస్యలు ఉంటే తెలియజేయవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏవో శిరీష్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, పలువురు సూపరింటెండెంట్ లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- పాల్గొన్న కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురంలో స్థానిక పద్మనాభ కాలనీలో గల గరల్స్ హైస్కూల్ నందు ప్రధానోపాధ్యాయులు బి.జె.రవీంద్ర ఆధ్వర్యంలో ప్రొగ్రామ్ ఇన్‌చార్జి టి.సుబ్బారావు, ఇన్‌చార్జి హెచ్ఎం సాయి రోహిణి, శివయ్యల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులలో మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడానికి, అంతరించిపోతున్న కళారూపాలను పరిచయం చేయడానికి సంక్రాంతి సంబరాలు ఎంతగానో దోహదపడతాయని, కౌన్సిలర్లు తృలికి సత్యభాస్కరరావు, పెంటకోట సత్తిబాబులు తెలిపారు. స్కూల్ అంతా సంక్రాంతి శోభను సంతరించుకుంది. విద్యార్థులు రంగవల్లులతో పాటు, ప్రాచీన కళలకు సంబంధించిన గంగిరెద్దులాట, బుడబుక్కల వేషధారణ, హరిదాసుల వేషధారణలు, విద్యార్థుల పలు వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకమహాలక్ష్మీ, వి.ఎల్.ఎన్.కుమారి, ఎస్.ఎస్.సుశీల, సుబ్బారావు, హరిక, రాఘవమ్మ, రామలక్ష్మీ, జ్యోతికుమారి, సుభాషిణిలతో పాటు విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

తునిలో జరుగు తెలుగుదేశం సభను విజయవంతం చేయండి

- రూరల్ తెలుగుదేశం నాయకులు వాసిరెడ్డి, పెంకే పిలుపు

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : తునిలో జరుగు తెలుగుదేశం పిలుస్తుంది రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాస బాబా పిలుపునిచ్చారు. రూరల్ వైవీ దాసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక దుర్మార్గపు పాలన సాగుతున్నదని, దాన్ని ఇంటికి పంపించటానికి ప్రజలు సిద్ధంగా వున్నారని అన్నారు. వైసిపి పాలన వచ్చిన తరువాత కనీస అభివృద్ధి చేయలేదని, గత తెలుగుదేశం హయాంలో అనేక పథకాలు ఉండేవని, వాటి ద్వారా ఎస్సి, బిసి వర్గాల ప్రజలు స్వయం ఉపాధి పొందేవారని, వాటిని ఎత్తేసిన వైసిపి వారిని తొక్కేసారన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఈ మధ్య సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్ వచ్చి ప్రారంభించిటం హాస్యాస్పదం అన్నారు. రైతులను, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసిపి ను అతి త్వరలోనే ఇంటికి పరిమితం చేస్తామన్నారు.. రాజకీయాలో నూతనంగా అభ్యర్థుల వారి ప్రాంతాలను మార్చుతున్నారని, అసలు ప్రజలు జగన్నే మార్చాలని చూస్తున్నారన్నారు. తునిలో తమ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు అధ్యక్షతన జరిగే సభకు రూరల్ నియోజకవర్గం నుండి వేలాదిగా తరలి వెళతామని, జనసేన నాయకులు కార్యకర్తలు సైతం ఈ సభకు వేలాదిగా హాజరావుతారని, ముందుగా సర్పవరం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి ర్యాలీగా తరలి వెళ్తామ్మన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రాందేవు సీతయ్య దొర, జంక్షన్ బాబ్జి, జ్యోతి వీరకుమార్ తదితరులు పాలొన్నారు.

విజయవాడ ధర్నాకు వెళ్ళొద్దు - పోలీసులు

- ఖండించిన యుటిఎఫ్

కూనవరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ మాకు రావాల్సిన ఆర్థిక పి.ఎఫ్. బకాయిలు సొమ్ములు రూ.1000 కోట్లు వెంటనే చెల్లించాలని ,ఎ.పి.జి.ఎల్.ఐ.లోన్లు,ఫర్టు ఫైనల్ పేమెంట్స్ బకాయిలు రూ.330 కోట్లు చెల్లించాలని, పిఆర్‌సి & డిఏ బకాయిలు రూ.7,382 కోట్లు చెల్లించాలని, పి.ఆర్.సి. తరువాత డి.ఏ.బకాయిలు, సరెండర్ లీవ్ అరియర్లు బకాయిలు రూ.4884 కోట్లు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ఖాతాకు జమ చేయవలసిన రూ.4500 కోట్లు చెల్లించాలని మరియు 1వ తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనవరి 9వ,10వ తేదీల్లో విజయవాడ లోని ధార్నా చౌక్ సెంటర్ జరిగే ధర్నాకు వెళ్ళొద్దని అలాగే వెళ్ళినచో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ రోజు సబ్-ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ కూనవరం శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేసి నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామిక చర్య అని యు.టి.ఎఫ్.కూనవరం మండల కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తుమని మండల అధ్యక్ష/ ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు డిమాండ్ చేశారు.

సారా అమ్మకాలపై సెబ్ పోలీసుల దాడులు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సిఐ కె.వి.స్వామి ఆధ్వర్యంలో సోమవారం పెద్దాపురం సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దాపురం మండలం, ఉలిమేశ్వరం గ్రామంలో సెబ్ సిబ్బంది దాడి చేసి 10 లీ. నాటుసారాతో ఒక మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సిఐ కె.వి.స్వామి తెలిపారు. అలాగే పెద్దాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో నిందితులను పెద్దాపురం తహశీల్దార్ వజ్రపు జితేంద్ర ఎదుట 24 మందిని, జగ్గంపేట తహశీల్దార్ ఎదుట 11 మందిని, గండేపల్లి తహశీల్దార్ ఎదుట 8 మందిని, మొత్తం 43 మందిని బైండోవర్ చేయడం జరిగిందని సెబ్ సిఐ స్వామి తెలిపారు. అంతేగాకుండా ఎవరైనా నాటు సారా అమ్మినా, తయారుచేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడులలో ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, సెబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం -స్పందనకు 451 అర్జీలు

కాకినాడ, మేజర్ న్యూస్ : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి జేసీ ఇలక్కియ.. ఇన్చార్జి డీఆర్‌వో, డీఆర్డీఏ కె.శ్రీరమణి, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, సీపీవో పీ.త్రీనాథ్, జిల్లా పంచాయతీ అధికారిణి కె.భారతి సౌజన్య, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి హాజరై జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించ వలసిందిగా ఆయా శాఖల అధికారులకు జేసీ ఆదేశాలు జారీ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 451 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జేసీ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలనన్నారు. రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ ఎస్ ఇలక్కియ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థుల సంక్రాంతి సంబరాలు..

ఏలేశ్వరం,మేజర్ న్యూస్ : భాష్యం స్కూల్ ఆవరణలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గొల్లపల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు భోగి, సంక్రాంతి, కనుక పండుగల విశిష్టతను తెలియజేశారు.తెలుగు పండుగల్లోసంక్రాంతిపండగ సంప్రదాయాన్ని, చరిత్రను పండుగ చేసుకోవడానికి గల కారణాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సంబరాలలో గొబ్బెమ్మలు, రంగవల్లులు, గాలి పటాలు, భోగి మంట, భోగి పళ్ళు, బొమ్మల కొలువు, గంగిరెద్దులాట చూపరులను అలరించాయి. ఈ సంబరాలలో విద్యార్థులు వివిధ సాంప్రదాయ దుస్తులు, పంచెకట్టులలో,నారదుని వేషధారణలతో అలరించారు. ఈ సంబరాలను పురస్కరించుకుని భాష్యం స్కూల్ చైర్మన్ భాష్యం రామకృష్ణ , జోనల్ ఇంఛార్జి గోవిందరాజులు, ప్రిన్సిపల్ అనిల్ కుమార్, ప్రైమరీ ప్రిన్సిపల్ ఉషారాణి ఉపాధ్యాయ బృందం పిల్లలకు , తల్లిదండ్రులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.